క్లుప్తంగా

నేడు, రేపు సుకన్య సమృద్ధి యోజన ప్రత్యేక డ్రైవ్

ఏలూరు (టూటౌన్): భారత తపాలా శాఖ అమృత్ పెక్స్–2023 కార్యక్రమంలో భాగంగా ఈనెల 9, 10 తేదీల్లో సుకన్య సమృద్ధి యోజన ఖాతాల ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఏలూరు డివిజన్ పోస్టల్ సూపరింటిండెంట్ మహమ్మద్ ఆసీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లలోపు ఆడపిల్లలకు ఈ పథకం వర్తిస్తుందని, ఖాతా కాలపరిమితి 21 సంవత్సరాలని, బాలికకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత ఉన్నత విద్యకు ఉన్న మొత్తంలో 50 శాతం వరకు లోనుగా పొందవచ్చని పేర్కొన్నారు. కనీసం రూ.250తో ఈ ఖాతాను ప్రారంభించవచ్చని తెలిపారు. ప్రస్తుతం 7.6 శాతం వడ్డీ రేటుతో అన్ని పోస్టాఫీసుల్లో ఈ ఖాతా లభిస్తుందని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు, కొలీజియంను కించపర్చడం తగదు

ఏలూరు (టూటౌన్): కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు కొలీజియంను, సుప్రీంకోర్టును నిందించడం తగదని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ లాయర్స్ ఫ్రంట్ అధ్యక్షుడు గొట్టుముక్కల రోనాల్డ్ రాజు పేర్కొన్నారు. కొలీజియం, సుప్రీంకోర్టును కించపర్చే విధంగా తరచూ వ్యాఖ్యలు చేయడం భారత రాజ్యాంగం పరిధులను అతిక్రమించడమేనని తెలిపారు. ఈ మేరకు లేఖ రాష్ట్రపతి, ప్రధానిలకు బుధవారం ఈమెయిల్, పోస్టు ద్వారా పంపించినట్టు పేర్కొన్నారు.

హెల్మెట్ ధరించాల్సిందే



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఏలూరు టౌన్: వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఇది రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాల రక్షణగా ఉంటుందని ట్రాఫిక్ సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు ఆదేశాల మేరకు నగరంలో గూడ్‌షెడ్ రోడ్డు, ఇతర ప్రాంతాల్లో వాహనచోదకులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్సైలు శ్రీనివాసరావు, శ్రీధర్, వెంకటేశ్వరరావులు నగరంలోని పలు ముఖ్య కూడళ్ల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు కలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్సు, ఇతర పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అధిక వేగంగా, మద్యం సేవించి వాహనాలను నడపడాన్ని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా ఉరుసు ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గన్ బజారులోని మౌలా అలి ముషికిల్ కుష మహాత్ముని దర్గాలో ఉరుసు ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ ముస్లింలు అత్యంత ఉత్సాహంగా నిర్వహించే వేడుకల్లో ఉరుసు ఉత్సవాలు ఒకటని, వీటిలో హిందువులు, క్రైస్తవులు సైతం పాల్గొని సుహృద్భావ వాతావరణాన్ని నెలకొల్పడానికి కృషి చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. తొలుత షేక్ బాజాన్ (అబ్బాస్) గృహంలో ప్రధాన ఫాతెహాఖానీ పూజలను ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ నిర్వహించారు. అనంతరం సందల్‌షరీఫ్ (గంధం) ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 700 మంది పాల్గొని మహాత్ముని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో దర్గా వంశపారంపర్య ముజావర్లు షేక్ షబ్బీర్, షేక్ రిజ్వాన్, షేక్ సలీమ్, షేక్ నదీమ్, కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా, ఎండీ ఎగ్బాల్, ఎండీ అస్లాం, రాజా అహ్మద్, ఎండీ నజీర్, ఎండీ కాలేషా తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు, దర్గా ముజావర్లు

సీఎం జగన్‌కే ముస్లిం మైనార్టీల మద్దతు

వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ డాక్టర్ కామిల్ జమ

ఏలూరు టౌన్: పేద కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు, వారి పిల్లల బంగారు భవిష్యత్తుకు పటిష్టమైన పునాదులు వేస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం మైనార్టీలంతా మద్దతుగా ఉంటారని ఏలూరు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ డాక్టర్ కామిల్ జమ అన్నారు. ఆయన బుధవారం ఏలూరులో మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి నేటికీ ముస్లిం మైనార్టీల గుండెల్లో కొలువై ఉన్నారని చెప్పారు. నేడు సీఎం జగన్ ప్రతి సంక్షేమ పథకాన్నీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చేరువ చేస్తూ.. వారి అభివృద్ధికి పాటుపడుతున్నారని వివరించారు. సీఎం జగన్ మూడున్నరేళ్ల పాలనలో సుమారు రూ.21 వేల కోట్లు ముస్లింల అభివృద్ధికి ఖర్చు చేశారని, వీటిలో రూ.10 వేల కోట్లు వారి ఖాతాల్లోకే జమ చేశారని గుర్తుచేశారు. ముస్లింకు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారని, నలుగురికి ఎమ్మెల్సీలు ఇచ్చారని, నలుగుర్ని ఎమ్మెల్యేలుగా గెలిపించి చట్ట సభలకు పంపారని తెలిపారు. దూదేకు, నూర్‌బాషా కార్పొరేషన్, సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టటం ఆనందదాయకమని తెలిపారు. 32 వేల ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు బోర్డుకు స్వతంత్ర అధికారాలు కట్టబెట్టటంతోపాటు, కర్నూల్‌లో వక్ఫ్ ట్రిబ్యునల్ సైతం ఏర్పాటు చేశారని వివరించారు. మత పెద్దలు ఇమామ్‌లకు గౌరవ వేతనాలను రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు, మౌజన్‌లకు గౌరవ వేతనాలు రూ.3 వేలు నుంచి రూ.5 వేలుకు పెంచారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో 8.1 లక్షలకు పైగా ముస్లిం కుటుంబాలకు సీఎం జగనన్న రూ.81 కోట్లు సాయం చేశారని వివరించారు.



డాక్టర్ కామిల్ జమ

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపానలు, హరేరామ సంకీర్తనలు, స్వామి వారికి సహస్రనామ పూజలు నిత్య హోమం చేసి స్వామి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం విజయవాడకు చెందిన మాధురి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాయకుడు పీవీఏ ప్రసాద్ బృందం భక్తిగాన కచేరి నిర్వహించి వీనుల విందు చేశారు. నగరానికి చెందిన టీవీ కళాకారిణి, సప్పా భారతి భాగవతారిణి భీష్మ ప్రతిజ్ఞ అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు చేయగా, శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ పర్యవేక్షించారు.



హరికథా కాలక్షేపం చేస్తున్న సప్పా భారతి భాగవతారిణి

‘నా భర్త ప్రాణం కాపాడండి’

ఏలూరు (టూటౌన్): తన భర్త ప్రాణం కాపాడాలంటూ స్థానిక తంగెళ్లమూడి పరిధి కబాడీగూడెంకు చెందిన కాశి వాణి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆమె భర్త కాశి శివ మూడేళ్లుగా లివర్ సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్నారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో వాణి స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల నాని దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే నాని సీఎంఆర్ఎఫ్ కింద రూ.10 లక్షలు మంజూరు చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని తమకు మిగిలిన రూ.20 లక్షలు సమకూర్చుకోవటం భారంగా మారిందని, సీఎం వైఎస్ జగన్ తన భర్త ప్రాణం కాపాడేందుకు అవసరమైన సొమ్మును మంజూరు చేయాలని వేడుకుంటోంది.



సాయం కోసం ఎదురు చూస్తున్న కాశి శివ కుటుంబ సభ్యులు

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్): మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధం, నిర్బంధ వెట్టిచాకిరీ నిర్మూలనపై బుధవారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన వర్క్‌షాపులో ఆమె మాట్లాడారు. మానవ అక్రమ రవాణాలో బడుగు, బలహీన వర్గాలు బలవుతున్నాయని, ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకునేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీ జిల్లా వ్యాప్తంగా మానవ అక్రమ రవాణా, నిర్బంధ వ్యక్తి వెట్టి చాకిరీ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఎన్జీవోస్, డిస్ట్రిక్ట్ చైల్డ్‌ప్రొటెక్షన్ ఆఫీసర్, పోలీసు, కార్మిక శాఖ అధికారులు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజేశ్వరి

పేదలకు దుస్తుల పంపిణీ

దెందులూరు: స్థానిక బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలోని పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ సుగ్గిశెట్టి నూకరాజు, అధ్యాపకుల ఆధ్వర్యంలో 2023 సంవత్సర విద్యార్థులకు సీనియర్లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీనియర్లు, జూనియర్లు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడికి సత్కారం

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షులు తొత్తడి వేదకుమారి విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ కమిటీ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం గ్రామస్తులుగా తమకు ఎంతో సంతోషంగా ఉందని దెందులూరు ఆర్యవైశ్య సంఘ నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు, సుగ్గిశెట్టి హనుమాన్ అన్నారు. సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, కొటకల రామారావు తదితరులు వేదకుమారి, కృష్ణ దంపతులను శాలువా, పూలదండలు, బొకేలతో, అమ్మవారి జ్ఞాపికతో సత్కరించారు. పదవినిచ్చిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బీఓసీ కార్మికుల ధర్నా



కార్మికశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): బీఓసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎలక్ట్రికల్ వర్కర్స్ అండ్ కాంట్రాక్టర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కార్మికశాఖ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లన్నీ తక్షణం పరిష్కరించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్, పింఛన్ సౌకర్యాలు కల్పించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేసి బీఓసీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఈ మేరకు డీసీఎల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు, యూనియన్ కార్యదర్శి బి.సురేష్ బాబు, కోశాధికారి జి.శ్రీరామచంద్రమూర్తి, లీగల్ అడ్వైజర్ నంబూరి శ్రీమన్నారాయణ, ఎండీ అమీర్ అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరదుర్గా వ్రతాలమ్మ తల్లి ఉత్సవం

పెదపాడు: పెదపాడు మండలంలోని వీరమ్మకుంట గ్రామంలో వీరదుర్గా వ్రతాలమ్మ ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. మరడాని వారి ఇంటి ఇలవేల్పు అయిన అమ్మవారి ఉత్సవాలు 4రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 5గంటల నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. బ్యాండు మేళం, డప్పు వాయిద్యం, కోలాటం, కర్రసాధన, గండిరెడ్డుల మేశం శక్తి వేషాలు చిత్ర విచిత్ర వేషధారణతో అమ్మవారిని భారీ ఊరేగింపు నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వీరమ్మకుంటలో వీరదుర్గా వ్రతాలమ్మ వారు

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్యాభ్యాసం

పెదవేగి : పూర్వ ప్రాథమిక విద్యే అంగన్‌వాడీ బాలలకు బలమైన పునాది అని పెదవేగి ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ అన్నారు. బుధవారం ఆయన పెదవేగి మండలంలోని కవ్వగుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాలలతో కొద్దిసేపు ముచ్చటించి, ఆటపాటలతో పలు అంశాలు నేర్పించారు. బాలలు కొన్ని పొడుపు కథలు, ముచ్చట గొలిపే పాటలు వినిపించారు. ఆటపాటలతో కూడిన విద్య బాలల వికాసాన్ని పెంపొందిస్తాయని ఆయన అన్నారు. అంగన్‌వాడీ ద్వారా బాలలకు అందుతున్న పోషకాహారం నెలవారీ ఎదుగుదల, అంగన్‌వాడీ టీచర్ బాలలకు నేర్పుతున్న అంశాలపై ఆరా తీశారు. రోజువారీ అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకుని ఎంపీడీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులకు, బాలింతలకు క్రమం తప్పకుండా మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు ఎంపీడీఓ సూచించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	55
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	05-07
బెండకాయలు	50	కంద	40
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	32
కాకర కాయలు	30-36	కీరా దోస	30
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	50
బీరకాయలు (పందిరి)	56	అల్లం	68
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34	పాలకూర	08
దొండకాయలు	26	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	24	గోంగూర	08
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	32	బజాజీ	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	04
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	17
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	13
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

నేలల స్వభావం ఆధారంగా పంటల దిగుబడి

పెదవేగి : నేలల స్వభావం ఆధారంగా పంటల దిగుబడులు ఉంటాయని పెదవేగి మండల వ్యవసాయాధికారి ఎం.ప్రియాంక అన్నారు. మండలంలోని న్యాయంపల్లి గ్రామంలో ఏఓ బుధవారం మొక్క జొన్న పొలాల్లో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ప్రియాంక మొక్కజొన్న రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంట అనువైన నేలల్లో బలంగా పెరిగి అధిక దిగుబడి ఇస్తుందని చెప్పారు. కొన్ని రకాల చౌడు భూముల్లో మొక్కజొన్న పంటకు ఎదుగుదల లోపంతో పాటు జింక్, పొటాషియం, నత్రజని శాతం తగ్గి మొక్క దశలోనే తెగుళ్ల బారిన పడుతుందన్నారు. ఇటువంటి నేలల్లో మొక్కజొన్న సాగు చేసే రైతులు నేల స్వభావాలను భూ పరీక్షల ద్వారా తెలుసుకుని సాగు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంట పొత్తు ఏర్పడే దశలో మిత్ర పురుగులు, శత్రు పురుగులు ఆశిస్తాయని చెప్పారు. పురుగుల సంఖ్యను అంచనా వేసుకుని వాటి నివారణకు అవసరమైతే పురుగు మందును పిచికారీ చేయాలని ఏఓ ప్రియాంక న్యాయం పల్లి రైతులకు వివరించారు. మొక్కజొన్న కర్రల ఆకుల మాటున మొవ్వలలో దాగి ఉన్న పురుగులను గుర్తించి రైతులతో తీయించారు. మొక్కజొన్న పంటలో పురుగు మందు పిచికారీ చేసే సమయంలో రైతులు ముఖానికి మాస్క్‌లు, చేతులకు గ్లౌజ్‌లు తప్పని సరిగా ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు పాల్గొన్నారు.



న్యాయంపల్లిలో పొలం బడి నిర్వహిస్తున్న అధికారులు

ఈ–క్రాప్ నమోదు

దెందులూరు: ఈ–క్రాప్ నమోదు విధానం పటిష్టంగా అమలు చేయాలని సంబంధిత శాఖాధి కారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. బుధవారం కొవ్వలిలో వరిచేలను వ్యవసాయ శాఖ సిబ్బంది చేస్తున్న ఈ–క్రాప్ నమోదు విధానాన్ని పరిశీలించి మండలంలో గ్రామాల వారీగా సిబ్బంది ఎన్ని ఎకరాలు ఈ–క్రాప్ నమోదు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వీఆర్ఓ కిషోర్, గ్రామ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ ఉన్నారు.

జగనన్న ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం కావాలి

దెందులూరు : దెందులూరు నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం కావాలని ఇళ్ల నిర్మాణం పర్యవేక్షణ చురుగ్గా జరగాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం జాతీయ రహదారిపై కేఎస్‌పురం సమీపంలో ఏలూరు ఆర్‌డీఓ పెంచల కిషోర్, దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్డీఓ, తహసీల్దార్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, ఉన్నారు.



కేఎస్ పురం వద్ద ఆర్డీఓ పెంచల కిషోర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

దెందులూరు ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించి పరిష్కార నిమిత్తం వినతులను అందజేశారు. సమస్యలను కార్యాలయ సిబ్బందితో నమోదు చేయించి పరిష్కారం కోసం సంబంధిత శాఖాధికారులకు ఎమ్మెల్యే సిఫార్సు చేశారు.

ఎస్సై వీర్రాజు సేవలు అభినందనీయం

దెందులూరు: ఎస్సై ఐ.వీర్రాజు సేవలు, విధి నిర్వహణ అభినందనీయమని గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ కమిటీ పేర్కొంది. ఉత్సవాలు ముగిసిన సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న ఎస్సై సేవలను కొనియాడారు.

జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగులు

పెదపాడు: రాజుపేట జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగులతో కళకళలాడుతోంది. ఇటీవల రాజుపేట గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు అందించారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. దీంతో గ్రామంలో పైపులైన్లతోపాటు విద్యుత్ స్థంభాలు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించడంతో గ్రామ పంచాయతీ ఆ స్థంభాలకు విద్యుత్‌దీపాటు ఏర్పాటు చేశారు. బుధవారం విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీచంద్ర దుర్గాప్రసాద్, స్థానిక సర్పంచ్ తొందురు క్రాంతికుమార్ స్విచ్ వేసి విద్యుత్ దీపాలను ప్రారంభించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజలకు ఉత్తమ సేవలు

పెదవేగి : ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలందుతున్నాయని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పి పూర్ణిమ చెప్పారు. బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పెదవేగి పీహెచ్‌సీ పరిధిలోని జానంపేట పంచాయతీ సచివాలయంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఇంటి వద్దే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లలేని వారికి, నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కోసం ప్రతి పీహెచ్‌సీలో ప్రభుత్వం ఇద్దరు డాక్టర్లను నియమించిందన్నారు. 104 మొబైల్ యూనిట్‌తో సహా సిబ్బంది డాక్టర్‌తోపాటు ఆశా వర్కర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. పెదవేగి పీహెచ్‌సీ పరిధిలో 28 సచివాలయాల్లో టూర్ షెడ్యూలు ప్రకారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓపీ అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, గుడ్లు, పంపిణీ తీరుపై వాకబు చేశారు. పాఠశాలను పూర్ణిమ సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. పలువురు గర్భిణులు, బాలింతలు, ఆరోగ్యశ్రీ వైద్యం అనంతరం ఇంటిదగ్గర ఉన్న రోగుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకునేందుకు ఆయా గృహాలను వైద్య బృందం సందర్శించింది.

బాల్య వివాహం నేరం

ఉంగుటూరు: బాల్య వివాహాలు చేయడం నేరమని పీహెచ్‌సీ డాక్టరు శ్రావణ రెడ్డి తెలిపారు. వెల్లమిల్లి పంచాయతీ వద్ద బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచి వస్క కుమారరాజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో శ్రావణ రెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18, మగవాళ్లకు 21 ఏళ్లు నిండిన తరువాత వివాహం చేయాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ వయస్సు నిండకుండా పెళ్లి చేస్తే పుట్టే పిల్లలకు, తల్లికి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు.

నేడు నిడమర్రులో గడపగడపకు మన ప్రభుత్వం

నిడమర్రు : గ్రామ సచివాలయం పరిధి గురువారం నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని, మూడేళ్లలో ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారని పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.